

కామేపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్

## మాయగాళ్ల వన్నీ మాటల గారడీలే..

- బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఏంటో మెరుస్తున్న సీసీ రోడ్లే చెప్తాయి
- అభివృద్ధి చేసిన కేసీఆర్ వెంటనే నియోజకవర్గ ప్రజలు ఉన్నారు
- కామేపల్లి మండల పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ

కారేపల్లి (కామేపల్లి), నవంబర్ 24: కాంగ్రెస్ మాయగాళ్లవన్నీ ఒట్టి మాటల గారడీలేనని బీఆర్ఎస్ ఇల్లెందు నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియానాయక్ విమర్శించారు. వారు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలెవరూ నమ్మడం లేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో గ్రామాల్లో అద్దంలా మెరుస్తున్న సీసీ రోడ్లు కూడా చెబుతున్నాయని అన్నారు. అందుకని అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్ వైపే ప్రజలందరూ ఉన్నారని స్పష్టం చేశారు. కామేపల్లి మండలంలో శుక్రవారం పర్యటించిన ఆమె.. కెప్టెన్ బంజర, ముచ్చర్ల, రాయిగూడెం, రుక్కితండా, బండిపాడు, కొమినేపల్లి గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేవలం ఎన్నికలప్పుడే గ్రామాల్లో కన్పించే నాయకులందరూ నేడు ప్రజలకు అనేక మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. గ్యారెంటీలన్నీ సాధ్యం కానివేనని, ప్రజలను మభ్యపెట్టేందుకే వారు వీటి గురించి ప్రచారం చేస్తున్నారని అన్నారు. గడిచిన ఐదేళ్లలో సీఎం కేసీఆర్ సహకారంతో ఇల్లెందు నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశానని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. వివిధ గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యే హరిప్రియ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు దనియాకుల హన్మంతరావు, బానోత్ సునీత, గుంపెనపల్లి అనంతరాములు, జాటోత్ లూసీ, మూడు దుర్గాజ్యోతి, బోడెపూడి అనురాధ, మల్లంపాటి నర్సింహారావు, ఆంతోటి అచ్చయ్య, వడియాల కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గుగులోత్ సునీత, మూడు రాధ, కృష్ణప్రసాద్‌నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు, చల్లా హరి, అజ్మీరా రాజునాయక్, ఐతనబోయిన విఠల్, దండగల దేవేందర్, బట్టు శంకర్, కొనకంచి శంకర్, భగవాన్, దూగుంట్ల వీరన్న, బానోత్ రాములు, ప్రసాద్, దొడ్ల రవి పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌తోనే ప్రగతి పరుగులు

- మళ్లీ ఆయన గెలిస్తేనే మరింత అభివృద్ధి సాధ్యం
- ఏన్కూరు ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్



ప్రచారంలో అభివాదం చేస్తున్న మదన్‌లాల్

వైరా టౌన్, నవంబర్ 24: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే రాష్ట్రంలో ప్రగతి పరుగులు సాధ్యమయ్యాయని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పేర్కొన్నారు. మళ్లీ ఆయన గెలిస్తేనే మరింత అభివృద్ధి, మరిన్ని సంక్షేమ పథకాలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. ఏన్కూరు మండలంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఏళ్ల తరబడి ఉన్న పోడు సమస్యను పరిష్కరించి పోడు భూములకు పట్టాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. పైగా పోడు భూములకు రైతుబంధు అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని అన్నారు. ఆయన ఆశీస్సులతో పోటీ చేస్తున్న తనను ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బుజ్జి, బాదావత్ బాలాజి, బానోత్ సురేశ్‌నాయక్, నామా వెంకయ్య, యండ్రాతి మోహన్‌రావు, వాసిరెడ్డి వెంకటేశ్వర్లు, చీటి వెంకటేశ్వరరావు, ముదిగొండ నాగేశ్వరరావు, పొన్నం హరికృష్ణ, కట్టా సత్యనారాయణ, అజ్మీర రైలు, బానోత్ ప్రసాద్, మాదినేని అశోక్, ఈశ్వర్‌నాయక్, బాజి, బానోతు బాలాజి, పూర్ణకంటి నాగరాజు, కడియాల సుధాకర్, బేతుమల్ల వేణు, వజీర్, పటాన్, జలాల్ ఖాన్, గొంది రవి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ప్రచారానికి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలుకుతున్న గిరిజనులు

# ఖమ్మాన్ని అగ్రభాగాన నిలబెడతా

- మరో అవకాశమిస్తే పెద్ద నగరాల మాదిరిగా తీర్చిదిద్దుతా..
- ఇప్పటికే సాంకేతికతను జోడించి చెత్త సేకరణ చేస్తున్నాం..
- ఖమ్మం డివిజన్ల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్



శ్రీచైతన్య ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్

ఖమ్మం, నవంబర్ 24: నియోజకవర్గ ప్రజలు మరో అవకాశమిస్తే ఖమ్మాన్ని పెద్ద నగరాల మాదిరిగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం రూపురేఖలను మరింతగా తీర్చిదిద్ది అగ్రభాగాన నిలుపుతానని మాట ఇచ్చారు. ఖమ్మం నగరంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. 49వ డివిజన్‌తో పాటు మరికొన్ని డివిజన్లలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంకొన్ని డివిజన్లలో రోడ్‌షోలు నిర్వహించారు. మరికొన్ని ప్రాంతాల్లో పలు సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలకు హాజరయ్యారు. తొలుత ఖమ్మం 49వ డివిజన్ మామిళ్లగూడెంలో జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి నమూనా బ్యాలెట్‌ను చూపిస్తూ ప్రచారం చేశారు. మొదటి బ్యాలెట్‌లోని మొదటి సంఖ్యలో ఉన్న కారు గుర్తుపై ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మాన్ని ఇప్పటికే ప్రశాంత నగరంగా, పర్యాటక నగరంగా తీర్చిదిద్దానని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో కూడా తనను అధిక మెజార్టీతో తనకు విజయాన్ని అందిస్తే ఖమ్మం శోభ మరింత విరాజిల్లేలా అభివృద్ధి చేస్తానని అన్నారు. పదేళ్ల క్రితం ఖమ్మం మున్సిపాలిటీ చెత్త సేకరణ అస్తవ్యస్తంగా ఉండేదని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తాను ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా అయ్యాక కొత్త విధానాలు తీసుకొచ్చానని అన్నారు. సాంకేతికతను జోడించి చెత్తను సేకరిస్తుండడంతో డివిజన్ల ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తాను ప్రచారానికి వెళ్లి ప్రతిచోటా ఇదే విషయాన్ని తనకు గుర్తుచేస్తున్నారని వివరించారు. అందుకని ఇక్కడి నుంచి తనను మరోసారి గెలిపించాలని, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు మన్నే వెంకటరమణ, మేడి పవన్ కుమార్, పొన్నం వెంకటేశ్వర్లు, ఊటుకూరి రవికాంత్, మన్నే శేషారత్నం, నల్లమోతు కోటేశ్వరరావు, శాబాసు శ్రీనివాస్‌రావు, పర్సా రంగారావు, గుండా కోటేశ్వరరావు, కే.రంగాచారి, వేముల సుధీర్, జమలాపురం కేశవరావు, కిషన్ రావు, వేణుగోపాల్, శ్రీనివాస్, నజీర్, పొన్నం వినేశ్, బాషా, దాక్షయిని, గోళ్ల రాధాకృష్ణ, షకీనా పాల్గొన్నారు.

# 'పొంగులేటి' ఓ బందిపోటు దొంగ

- పాలేరుకు వచ్చి పచ్చటి పల్లెల్లో చిచ్చులు పెడుతున్నాడు
- ఖమ్మం రూరల్ ప్రచారంలో ఎంపీ నామా, ఎమ్మెల్సీ తాతా మధు
- అర్హులందరికీ దళితబంధు వర్తింపు: బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ



ఖమ్మం రూరల్లో బీఆర్ఎస్ నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన జనం

ఖమ్మం రూరల్, నవంబర్ 24: కాంగ్రెస్ పార్టీ పాలేరు అభ్యర్థిగా పోటీచేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి బందిపోటు దొంగకంటే ప్రమాదకరమైనవాడని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు విమర్శించారు. పాలేరు ప్రజల గుండె చప్పుడులా ఉన్న కందాళ గురించి తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఇలాంటి చేష్టలతో పాలేరు నియోజకవర్గంలోని పచ్చటి పల్లెల్లో చిచ్చులు పెడుతున్నాడని ఆరోపించారు. ఖమ్మం రూరల్ మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి రెడ్డిపల్లి, పల్లెగూడెం, పోలెపల్లి, గోళ్లపాడు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కందాళ అంటే ప్రేమ, దయ, జాలికి నిదర్శనమని అన్నారు. అలాంటి నాయకుడిపై కాంగ్రెస్ అభ్యర్థి అనుచితంగా మాట్లాడటం, కరపత్రిక పేరుతో చిల్లర చేష్టలు చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. ధనం చూసుకొని విర్రవిడితే ప్రజల చేతిలో పరాభవం తప్పదని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి మరింత ప్రగతికి సహకరించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యరి కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలేరు అంటేనే ప్రశాంతతకు నిలయమని అన్నారు. ఇలాంటి ప్రదేశంలో పొంగులేటి చొరపడ్డారని, పల్లెల్లో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాడని ఆరోపించారు. ఇలాంటి సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గంలో అర్హులందరికీ దళితబంధు పథకం అందుతుందని అన్నారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బానోత్ చంద్రావతి, తాళ్లూరి జీవన్‌కుమార్, బెల్లం వేణుగోపాల్, యండపల్లి వరప్రసాద్, బెల్లం ఉమ, కళ్లెం వెంకటరెడ్డి, కొండం కళమ్మ, టీ.సంధ్యారాణి, అక్కినపల్లి వెంకన్న, గుండు శ్రీనివాస్, ఆంజనేయులు, మరికంటి వెంకటేశ్వర్లు, మురళి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు టీచర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించా

- కరోనా సమయంలో వారిని సీఎం కేసీఆర్ ఆదుకున్నారు
- పదేళ్ల అభివృద్ధిని విద్యావంతులందరూ గమనించాలి
- సత్తుపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటవీరయ్య



ప్రైవేటు టీచర్ల సమావేశంలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర

సత్తుపల్లి టౌన్, నవంబర్ 24: ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే టీచర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించానని సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. ప్రైవేటు టీచర్ల సమస్యలను అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఏకైక ఎమ్మెల్యేను తాను మాత్రమేనని గుర్తుచేశారు. కరోనా సమయంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రైవేటు టీచర్లకు ఆర్థిక సాయం అందించిందని అన్నారు. సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి ప్రైవేటు టీచర్లతో మాట్లాడారు. కరోనా సమయంలో ప్రైవేట్ టీచర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తాను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. దీంతో ఆయన వారి సంక్షేమం కోసం రూ.180 కోట్ల నిధులు మంజూరు చేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు టీచర్లకు రూ.2 వేల చొప్పున ఆర్థిక తోడ్పాటును అందించారని గుర్తుచేశారు. అదేవిధంగా సత్తుపల్లి ప్రాంతం గత పదేళ్లుగా ఎలా అభివృద్ధి చెందిందో విద్యావంతులైన ఉపాధ్యాయులు గమనించాలని కోరారు. సత్తుపల్లి పట్టణంలో అత్యాధునికమైన లైబ్రరీ నిర్మాణంతోపాటు 100 బెడ్ల ఆసుపత్రి, సత్తుపల్లి పట్టణంలో వేంసూరు రోడ్డులో నాలుగులైన్ల రహదారిగా విస్తరించడంతోపాటు సుందరమైన మున్సిపల్ భవనాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. బీఎస్సీ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయించామన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కూసంపూడి మధు, లింగారెడ్డి, వంశీ, కూసంపూడి మహేశ్, వనమా వాసు, మట్టా ప్రసాద్, రఫీ, మల్లూరు అంకమరాజు పాల్గొన్నారు.



మైదానంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య